# వివక్ష

"పుట్టబోయే బిడ్డ ఆడో, మగో... ఇక్కడ పరీక్ష చేసి చెప్పబడును."

సరళా నర్సింగ్ హోమ్ గోడమీద తెల్లటి అక్షరాలతో నల్లబోర్డు వేలాడుతోంది.

ఆ బోర్డును చూసి రిక్షా దిగాడు చంద్రశేఖరం. తరువాత అతని భార్య సుమతి దిగింది. 'నడు' అన్నట్టు తలూపి, చంద్రశేఖరం నర్సింగ్‌హోంలోకి అడుగు పెట్టాడు.

నర్సింగ్‌హోమ్ తెల్లని గోడలతో శుభ్రంగా, కంటికి హాయిగా వుంది.

కన్సల్టింగ్ రూమ్- డా. కె.సరళ ఎమ్.డి., డా. కె.రమేష్ ఎమ్.ఎస్. అన్న బోర్డు చూసి చంద్రశేఖరం ఆగాడు. రూమ్ ముందు వరసగా ఓ అరడజను గాడ్రేజ్ కుర్చీలున్నాయి.

జేబురుమాలుతో ముఖం తుడుచుకుని, సుమతిని ఓ కుర్చీలో కూర్చోమన్నాడు. ఆమె కూర్చుంటుండగా నర్సు వచ్చింది.

"డాక్టర్‌గార్ని కలుస్తారా?"

అవునన్నట్టు తలూపాడు చంద్రశేఖరం.

"లేడీ డాక్టర్‌గార్నా, లేక...?"

"లేడీ డాక్టర్‌గార్ని."

"కూర్చోండి, పిలుస్తాను" అని నర్సు కన్సల్టింగ్ రూమ్‌లోకి వెళ్ళింది.

కన్సల్టింగ్ రూమ్ గోడమీద ఓ పాప, ఓ బాబు ఎదురెదురుగా నిలబడిన రంగుల ఫొటో ఉంది. పాప మాట్లాడబోతున్నట్టో, మాట్లాడుతున్నట్టో నోరు తెరిచి ముద్దు ముద్దుగా వుంది. నోటిమీంచి ముక్కు మీద వేలేసుకుని 'ష్. నిశ్శబ్దం' అన్నట్టు నవ్వుకళ్ళతో బొద్దుగా ఉన్నాడు బాబు.

సుమతి పక్క కుర్చీలో కూర్చుని, కాసేపు కళ్ళు మూసుకుని, తరువాత కళ్ళు తెరిచి పైకి చూశాడు చంద్రశేఖరం. సీలింగ్ ఫేన్ నిశ్శబ్దంగా గిర్రున తిరుగుతోంది.

ఆ నగరంలోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా గైనకాలజిస్టుగా సరళకూ, సర్జన్‌గా రమేష్‌కూ మంచి పేరుంది. పేదవాళ్ళు ఎంతిస్తే అంతే ఫీజు

తీసుకుంటారు. ఇచ్చే స్తోమతు ఉన్నవాళ్ళ దగ్గర మాత్రం ఖచ్చితంగా వసూలు చేస్తారు. కొంత సేపటికి నర్సు వచ్చి చంద్రశేఖరం వంక చూసి- "రండి" అంది.

చంద్రశేఖరం, సుమతి కన్సల్టింగ్ రూమ్‌లోకి వెళ్ళారు. డాక్టర్ సరళను చూసి చంద్రశేఖరం విష్ చేశాడు. సుమతి నమస్కారం పెట్టింది.

సరళ చిరునవ్వుతో తల పంకించి "కూర్చోండి" అంది. ఎదురుగా ఉన్న కుర్చీల్లో ఇద్దరూ కూర్చున్నారు. "చెప్పండి. ప్రాబ్లం ఏమిటి?"

"మా ఆవిడకు రెండో నెల గర్భిణీ. మీరు పరీక్ష చేసి పుట్టబోయే బిడ్డ ఆడో, మగో చెబుతారని వచ్చాం."

"మీదీ ఊరేనా?"

"కాదండీ. ఈ సిటీకి దగ్గర్లోనే ఓ పల్లెటూరు. నేను ఉద్యోగం చేస్తున్నది మాత్రం ఇక్కడే."

"ఇప్పుడు పరీక్ష చేయడం కుదరదు. మరో నెలా పదిహేను రోజులు, లేదా రెండు నెలలు పోయాక రండి. అప్పుడు పరీక్ష చేసి చెబుతాను."

చంద్రశేఖరం ఏదో అనబోతుండగా- "పధ్నాలుగు వారాలు, లేదా పదిహేను వారాల గర్భిణీ అయితే కానీ పరీక్ష చేయడానికి కుదరదు" అంది సరళ.

ఇక చేసేది లేదు.

"పరీక్ష చేసేటప్పుడు బాధగా ఉంటుందాండీ?" సుమతి భయం భయంగా అడిగింది.

"ఇంజక్షన్ తీసుకునేటప్పుడు ఉండే బాధ కంటే ఎక్కువగా ఉండదు. పిండం నుంచి కొద్దిగా ద్రవం తీసి పరీక్ష చేస్తాం. అదీ ఇంజక్షన్ చేసినట్టే."

సుమతి ముఖంలో 'హమ్మయ్య' అన్న భావం.

"వెళ్ళొస్తాం డాక్టర్!" అని చంద్రశేఖరం లేచాడు.

సుమతి కూడా లేచి నిలబడింది.

"ఇది తొలి కానుపా? ఏ బిడ్డ కావాలనుకుంటున్నారు?" అడిగింది సరళ.

సుమతి భర్త వంక చూసింది.

చంద్రశేకరం ఆత్రుతగా 'మగబిడ్డ' అన్నాడు.

☆ ☆ ☆

"మొత్తానికి ఎలాగయితేనేం నా బరువు దించేసుకుంటున్నారు."

వస్తున్న కన్నీళ్ళను ఆపుకుంటూ నిష్ఠూరంగా అన్న ఆఖరి అమ్మాయి భుజంమీద చెయ్యేసి-

"ముహూర్తం వేళయింది. మనసు పాడుచేసుకోకు. ప్రశాంతంగా ఉండు. నడు" అంది చిలకమ్మ.

తల్లి చేతిని కోపంతో విసురుగా తోసేసి, పెళ్ళి పీటల దగ్గరకు నడిచింది చిన్నమ్మాయి.

చిలకమ్మకు కన్నీళ్ళొచ్చాయి.

ఆ సంబంధం వద్దని తను మొదటినుంచీ అంటూనే ఉంది. కానీ, తన మాటకు విలువేదీ? తన మాటకే విలువ ఉంటే, భర్త తను చెప్పినట్టు వినేవాడే అయితే, జరిగిన నాలుగు పెళ్ళిళ్ళూ అలా జరిగుండేవి కావు. నలుగు రమ్మాయిల బతుకులూ అలా బండలయ్యేవి కావు. తగిన కట్నాలిచ్చే శక్తి ఉండీ ఆయన దారినపోయే దానయ్యల్లాంటి వాళ్ళకు కూతుళ్ళను కట్టబెట్టేవాడుకాడు. చిన్నమ్మాయి నయినా కాస్త ఉన్నవాళ్ళ కిచ్చి చేస్తే సుఖపడుతుందని తను ఆశించింది. ఆఖరికి ఆ ఆశా అడియాసే అయింది.

"ఒసేవ్! ఇక్కడ నిలబడి పోయేవేటి, కర్రాటలాగ! కన్యాదానం చేయాలి, నడు నడు" అన్నాడు హడావుడిగా వచ్చి చలపతి.

కళ్ళలో ఉబికే అసహ్యాన్ని దాచుకుంటూ, పెళ్ళిపీటల దగ్గరకు నడిచింది చిలకమ్మ.

పచ్చని తోరణాలు తప్పితే పెళ్ళి పందిరికి ఇంకే అలంకారాలూ లేవు. చౌకబారు భజంత్రీల శబ్దం గోలగోలగా ఉంది.

చిలకమ్మ పెళ్ళి కొడుకును చూసింది. పీలగా, లోతుకుపోయిన కళ్ళతో ఉన్నాడు. "చిన్నమ్మాయి భుజం దగ్గరకు వస్తాడేమో' అనుకుంది చిలకమ్మ. చదువులేదు. పంచుకుంటే ఒక ఎకరం పొలం వస్తుందట. ఆ భాగ్యానికి అప్పుడప్పుడూ మందు కూడానట. చిన్నమ్మాయి బతుకు బుగ్గయిపోతోంది. చిలకమ్మ మనసు మెలితిరిగి పోయింది.

పురోహితుడు పెద్ద గొంతుతో మంత్రాలు చదువుతున్నాడు. అతను చెప్పినట్టు పెళ్ళికొడుకు తంతు నిర్వహిస్తున్నాడు.

కన్యాదానం, మాంగల్యధారణం జరిగిపోయాయి.

మర్నాడు ఉదయం- "ఏవిటమ్మా, ఇలాంటి సంబంధం చేశారు?" అన్నాడు ఓ చాదస్తపు దూరపుబంధువు- ఊరెళ్ళడానికి సెలవు తీసుకుంటూ.

చిలకమ్మ జవాబివ్వలేదు. "ఇప్పుడే వస్తాను" అంటూ అక్కడనుంచి తప్పుకుంది. దార్లో ఓ పదహారేళ్ళ అర్భనాకారపు గుంటడు ఆమెను అడ్డుకుని, చిన్న పిల్లాడిలా దేనికో మారాం చేస్తూ గెంతుతున్నాడు.

"చూశావు కదా! ఆ రాలుగాయి వెధవకోసం అయిదుగురు ఆడపిల్లల గొంతూ కోశాడు వాళ్ళ నాన్న. ఉన్నదంతా ఆ కొడుక్కోసం మీదు కట్టేశాడు" అన్నాడు పక్కనున్నాయన.

చిలకమ్మ ఏమీ విననట్టుగా కొడుకును కసురుతూ వంట గదిలోకి వెళ్ళిపోయింది.

☆ ☆ ☆

కన్సల్టింగ్ రూమ్ నుంచి వరండాలోకొచ్చి, ఆ పక్కనే ఉన్న ఇన్‌పేషెంట్ల గదుల్లోకి వెళ్ళింది సరళ. పేషెంట్లను చూసి ధైర్యం చెప్పాల్సిన వాళ్ళకు ధైర్యం చెప్పి, మళ్ళీ కన్సల్టింగ్ రూమ్‌లోకి నడిచింది.

రమేష్ కుర్చీ ఇంకా ఖాళీగానే వుంది.

"ఆయన థియేటర్ నుంచి వచ్చేటప్పటికి ఇంకో గంటయినా పడుతుంది" అనుకుంది సరళ.

టేబుల్ మీదున్న పుస్తకం తీసింది చదవడానికి. కాస్త తీరిక దొరికితే చాలు సరళ ఏదో ఓ పుస్తకం చదువుతుంది. ప్రొఫెషన్‌కు సంబంధించినవే కావు, రాజకీయాలు, సాహిత్యం, ఆఖరికి సినిమా పత్రికలు కూడా చదువుతుంది. ఆ రోజు ఆమెకు ఏమీ చదవబుద్ధి కావడం లేదు. బహు చికాకుగా ఉంది. తామేదో తప్పు చేస్తున్నట్టు అనిపిస్తోంది.

పొద్దుట ఒకామెకు డెలివరీ అయింది. బిడ్డకు అంగవైకల్యం. వాళ్ళది మేనరికం కాదు. మరి? సరళ ఆమెను గుచ్చి గుచ్చి అడిగింది. కడుపుతో ఉండగా ఆమె ఎంతో ఆందోళనకు గురైనట్టు తెలిసింది. భర్తా, అత్తమామలూ ఆమెను వేధించారట.

"కట్నం గొడవా?"

"కాదు. మీరు ముందే చెప్పారుగా ఆడపిల్లను కనబోతున్నానని. తరువాత మీరేమో అబార్షన్ చేయడానికి ఒప్పుకోలేదు."

"మీవల్ల రెండిందాల హాని నాకు జరిగింది" అన్న ధ్వని ఉంది ఆ గొంతులో.

అప్పటినుంచి సరళ మనసు మనసులో లేదు. కుర్చీలో వెనక్కి జారబడి కళ్ళు మూసుకుంది.

అంతలో నర్సు వచ్చింది.

"మేడమ్. ఎస్.డి.టెస్ట్ (సెక్ట్ డిటర్‌మినేషన్ టెస్ట్ లేక అమ్నియో సెంటిసిస్) చేయించుకోడానికి ఇద్దరొచ్చారు. పంపించమంటారా?"

"రేపు రమ్మను" అంది సరళ విసుగ్గా.

సాచివేత పరిష్కారం కాదు- మనసు మూలుగు.

నర్సు వెళ్ళబోతుంటే- "సరే రమ్మను" అంది రాజీ ధోరణిలో.

చంద్రశేఖరం, సుమతి లోపలికి వచ్చారు.

"కూర్చోండి" అంది సరళ చిరునవ్వు ముఖానికి పులుముకుంటూ.

"మేం నెలా పదిహేను రోజుల క్రితం వచ్చాం. అప్పుడు పరీక్ష చేయడం కుదరదన్నారు."

"అవును, గుర్తుంది. ఏమ్మా ఇప్పుడే పరీక్ష చేయించుకుంటారా?"

"ఊ" అంది సుమతి.

సరళ ఆలోచనలో పడింది. సుమతిని పరీక్ష చేయడానికి ఆమె మనసు మొరాయిస్తోంది.

"ఒకవేళ మీకు ఆడపిల్ల పుట్టేలా ఉంటే..."

సుమతి మాట్లాడలేదు. చేతి గోళ్ళను చూసుకుంటూ ఉండిపోయింది.

"అబార్షన్ చేద్దురుగాని" అన్నాడు చంద్రశేఖరం.

సరళ ముఖం ఎర్రబడిపోయింది. ఆడపిల్ల... అబార్షన్... అబార్షన్ ఆడపిల్ల... ఆడపిల్ల... అబార్షన్!

"కుదరదు" అంది సరళ మొహం గంటుపెట్టుకుని.

వాళ్ళిద్దరూ తెల్లబోయారు. సరళ అంతలోనే తేరుకుని "సారీ" అని, "చూడండి. ఆడపిల్ల పుట్టేలా ఉంటే అబార్షన్ చేయమని చాలా తేలిగ్గా అనేశారు. ఇప్పుడు అంటే దాదాపు నాలుగో నెలలో అబార్షన్ చేయడం మంచిదికాదు. తల్లి ఆరోగ్యం పాడయ్యే అవకాశముంది. తరువాత బ్లీడింగ్ ట్రబుల్‌తో బాధపడవలసి రావచ్చు."

"ఫర్వాలేదు" అని చంద్రశేఖరం అనగానే, సుమతే కాకుండా సరళ కూడా అతనివంక ఆశ్చర్యంగా చూసింది.

కొద్దిసేపు మౌనం తరువాత- "ఇలాగంటున్నానని మీరేమీ అనుకోవద్దు. ఏ బిడ్డయినా అబార్షన్ జోలికి పోమని మీరంటేనే పరీక్ష చేస్తాను" అంది సరళ తెచ్చిపెట్టుకున్న శాంతంతో.

ఆమె ముఖ కవళికలు గమనించిన చంద్రశేఖరానికి ఒళ్ళు మండిపోయింది.

"మీరిన్ని షరతులు పెడతారనుకోలేదు! ఈ షరతులు కూడా ఓ బోర్డు మీద రాయించి బయట గోడకు తగిలించండి. లేదా బయటి బోర్డును తీసేయండి. నడు సుమతీ!" అని చంద్రశేఖరం విసురుగా లేచాడు. సుమతి తలొంచుకుని అతని వెంట కదిలింది.

సరళ తల పట్టుకుంది. తరువాత టేబుల్‌మీద తల వాల్చి కళ్ళు మూసుకుంది. ఓ అయిదు నిమిషాలకు ఆపరేషన్ థియేటర్ నుంచి రమేష్ వచ్చాడు.

"ఏం సరళా! అలా డల్‌గా వున్నావ్?"

రమేష్ మాటలకు సరళ గబుక్కున తల ఎత్తింది. ఆమె కళ్ళలో ఏదో ఆవేశం.

"ఏం జరిగింది?" అన్నాడు రమేష్ కంగారుగా.

సరళ, నిగ్రహించుకుని- "ఏం లేదు. ఇంటికి వెళ్దామా?" అంటూ లేచి బయటికి కదిలింది.

ఇద్దరూ వీధిలోకి తమ కారు దగ్గరకు వెళ్ళబోతుండగా- రెండు రిక్షాలు ఆస్పత్రి ముందు ఆగాయి. ఒక రిక్షాలోంచి చలపతీ, రెండో రిక్షాలోంచి చిలకమ్మా, ఆమె కొడుకూ దిగారు. చలపతి డాక్టర్లిద్దరికీ నమస్కారం చేశాడు.

ఆస్పత్రి ఆఖరి మెట్టుమీద నుంచి 'ఏమిటన్నట్టు చూశాడు రమేష్.

"మా అబ్బాయికి ఈ మధ్య ఏం బాగోడంలేదు. మీకు చూపిద్దామని తీసుకొచ్చాను' అన్నాడు చలపతి.

"లోపలికి రండి" అని సరళవైపు తిరిగి- "నువ్వెళ్ళు, నేను తరువాత ఆటోలో వస్తాను" అని రమేష్ వెనుతిరిగి మెట్లెక్కాడు.

చలపతి కుటుంబానికి వాళ్ళు ఫేమిలీ డాక్టర్స్. రమేష్ కన్సల్టింగ్ రూమ్‌లోకి వెళ్ళి చలపతి కొడుకుని పరీక్ష చేసి- "ముందు ఎక్సరే తీయించండి. బహుశా ఆపరేషన్ అవసరం కావచ్చు. ఓ పదిహేను, ఇరవై రోజులు ఇక్కడ ఉండవలసి

రావచ్చు" అన్నాడు.

"అలాగేనండి. డబ్బెంత ఖర్చయినా ఫర్లేదు. మా వాడి ఆరోగ్యం బాగుపడితే అదే చాలు" చలపతి కంఠం వణికింది.

నర్సును పిలిచి "వీరికి రూమ్ చూపించు" అని రమేష్ ఇంటికి బయల్దేరాడు.

☆ ☆ ☆

రమేష్ ఇంటి కెళ్ళేటప్పటికి మధ్యాహ్నం మూడు గంటలయింది. శీతాకాలపు ఎండ వెచ్చ వెచ్చగా ఉంది.

రమేష్ బట్టలు మార్చుకుని భోజనం చేశాడు. సరళ మంచంమీద పడుకుని ఉంది. దగ్గరకెళ్ళి నుదుటిమీద చెయ్యేశాడు.

సరళ కళ్ళు తెరిచి- "ఎంత సేపయింది వచ్చి?" అని అడిగింది.

"ఓ అరగంటవుతుంది. భోజనం కూడా చేసేశాను. నువ్వు నిద్రపోతున్నావనుకున్నాను. ఇవేళ 'మూడీ'గా ఉన్నావేం?"

సరళ ఏమీ లేదంది. ఆమెను మరిపించడానికి రమేష్ చలపతి కొడుకు కేసు గురించి చెప్పాడు. చలపతి ఆత్రుత, దానికి కారణం, రోగాల విషయంలో కూడా ఆడా, మగా తేడాలు చెప్పుకుపోతున్నాడు రమేష్.

ఉండి ఉండి సరళ అందుకుంది. "అమ్నియో సెంటిసిస్ (ఎస్.డి) టెస్టులు చేయడం మానేద్దామని నిర్ణయించుకున్నాను."

ఏం. అన్నట్టు చూశాడు రమేష్.

"వాటివల్ల మంచి కన్నా చెడే ఎక్కువగా కనిపిస్తోంది."

"అదేంటలాగంటున్నావ్?" అన్నాడు రమేష్.

ఎస్.డి.టెస్టుల గురించి రమేష్‌కెప్పుడూ సదభిప్రాయం లేదు. సైన్స్ అడ్వాన్స్ అయ్యేకొద్దీ మనమూ దానితో సమానంగా అడ్వాన్స్ కావాలని వాదించేది సరళ. ఈ టెస్టులు కొత్తగా వచ్చినప్పుడు, వాటికి సంబంధించి మెడికల్ జర్నల్స్‌లోకానీ, ఇతర ఆంగ్ల పత్రికల్లోకానీ ఏ వ్యాసం వచ్చినా చదివేది. వాటిమీద రమేష్‌తో చర్చకు దిగేది. ఎస్.డి.టెస్టులను కుటుంబ నియంత్రణలో భాగంగా వినియోగించాలని ప్రభుత్వం ఆలోచిస్తుందన్న వార్త చదివేక సరళ మరి ఆగలేదు. బొంబాయి వెళ్ళి అక్కడి స్పెషలిస్టుల దగ్గర శిక్షణ పొంది వచ్చింది. ఆదిలో ఈ టెస్టులను ఎవరూ చేయించుకునే వారు కారు. ఇప్పుడిప్పుడే జనం

వీటికి ఎగబడుతుంటే సరళ మనసు మార్చుకుంటోంది.

"తమిళనాడులోని మదురై జిల్లాలో 'కల్లార్లు' చేసే పనికీ, నేను చేస్తున్న పనికీ తేడా లేదనిపిస్తోంది."

"కల్లార్లా?"

"ఆ అమధ్య 'ఇండియా టుడే'లో వచ్చిన వ్యాసం నువ్వు చదివావు కదా?"

'బోర్న్ టు డై' అన్న వ్యాసం చాలా హృదయవిదారకంగా ఉంది. కల్లార్లు భూమిలేని కార్మికులు. కట్నాలిస్తే తప్ప అక్కడి ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు కావు, మన దేశంలోని అన్ని చోట్లలాగే. ఆడ పిల్లను కష్టపడి పెంచి, పోషించి అవివాహితగా కష్టపెట్టేకంటే పుట్టగానే తుంచేయడం మేలనుకున్నారు వాళ్ళు. గత పదేళ్ళలోనూ కల్లార్లు ఆరు వేలమంది ఆడపిల్లల్ని పుట్టగానే విషం ఇచ్చి చంపేశారట.

కల్లార్ల వార్త రమేష్‌కు బాగా జ్ఞాపకం వచ్చినట్టు అతని కళ్ళలో కనిపించింది. అది గమనించి- "పుట్టిన ఆడపిల్లల్ని వాళ్ళు చంపుతున్నారు. పుట్టబోయే ఆడపిల్లల్ని నాలాంటి వాళ్ళు చంపుతున్నారు" అంది సరళ.

ఏదో జరిగిందనిపించింది రమేష్‌కు.

అడగ్గానే జరిగిన సంఘటనలు చెప్పింది సరళ.

"నిజమే. ఎస్.డి.టెస్టులు ఒకదానికోసం వస్తే లోకం ఇంకోదానికి వాడుకుంటోంది. చలపతిగారిలా మగపిల్లాడి కోసం వరసగా ఆడపిల్లల్ని కనేసి, ఆ తరువాత వాళ్ళను నరకంలో పడేసే బాధను తప్పించడానికి ఈ టెస్టులు ఉపకరిస్తాయి. ఏ దంపతులైనా కొడుకు కూడా కావాలనుకోవడం సహజం. అందుకోసం ప్రయత్నించే హక్కును మన మెలా కాదనగలం?"

"హక్కుల విషయానికొస్తే మగపిల్లాడిలాగే ఆడపిల్లకూ పుట్టి బతికే హక్కుంది. ఇద్దరూ లేక ముగ్గురు పిల్లలతో సరిపెట్టుకోవలసి వచ్చినప్పుడు వాళ్ళు ఆడయినా, మగయినా ఒకటిగానే చూడాలి. ఇప్పటికే వెయ్యిమంది పురుషులకు తొమ్మిది వందల ముప్పై అయిదు మంది స్త్రీలున్నారు. ఆడ పిల్లల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. ఎస్.డి.టెస్టులద్వారా పుట్టబోయే బిడ్డ ఆడో, మగో ముందుగానే చెప్పడంతో ఆడ సంతానమే అబార్షన్‌కు బలైపోతోంది. నా దగ్గరకు వస్తున్న కేసుల్ని చూస్తున్నాను కదా! పుట్టబోయేది మగబిడ్డయితే ఓకే. ఆడపిల్లయితేనే

అబార్షన్ చేయమంటున్నారు. ఇలాగే కొనసాగితే... కొంతకాలానికి మీ మగాళ్ళను కనడానికి తల్లులే ఉండరు!'' అంది సరళ ఆవేశపడిపోతూ.

సరళ ఆవేశం రమేష్‌కు అర్థమవుతోంది. అయితే శాస్త్ర విషయానికి వచ్చినప్పుడు కూడా డాక్టరయ్యుండీ ఆమె సబ్జెక్టివిటీ నుంచి బయట పడకపోతే ఎలా? సున్నితంగా ఈ విషయం సరళకు సూచించాడు రమేష్.

ఆమె రమేష్‌తో ఏకీభవిస్తూనే- ''ఆడ సంతానం సమస్యగా ఉంటే ఆ సమస్యను పరిష్కరించడానికి వేరే మార్గం చూడాలి. అంతేకానీ, అసలు ఆడ సంతానమే లేకుండా చేయాలనుకుంటే ఎలా?'' అంది.

''అన్ని దేశాల్లోనూ ఆడ సంతానం సమస్య కాదు. మనలాంటి వర్ధమాన దేశాల్లోనే ఈ సమస్య ఉంది. ఇంకా చెప్పాలంటే ఆస్తి హక్కును గ్యారంటీ చేసిన వ్యవస్థలోనే ఈ సమస్య ఉంది.''

సరళ ఆలోచనలో పడింది.

''నువ్వు ఎస్.డి.టెస్టులు మానేసినంతట్లో సమస్య పరిష్కారమవుతుందా? నువ్వు కాకపోతే మరొకరు చేస్తారు. ఆడపిల్ల సమస్య ఆర్థికపరమైంది. వ్యక్తిగత ఆస్తితో ముడిపడి ఉంది. బతుక్కి భద్రతలేని సమాజంలో ఆడపిల్లలు ఆర్థిక భారాలవుతున్నారు. సమస్య మూలాన్ని విస్మరించి మరేం చేయబోయినా నిష్ప్రయోజనమే!'' అన్నాడు రమేష్ శాంతంగా.

సరళ కాసేపు ఊరుకుని- ''నువ్వు చెప్పింది నిజమే కావచ్చు. కానీ, నా మనస్సాక్షికి వ్యతిరేకంగా నేనేపనీ చేయలేను. నావంతు బాధ్యతగా ఎస్.డి.టెస్టులను ఇక చేయను. రేపే మన నర్సింగ్‌హోమ్ గోడకు తగిలించిన బోర్డును తీయిం చేద్దాం'' అంది తన మాట కిక తిరుగులేనట్టు.

☆ ☆ ☆

''పుట్టబోయే బిడ్డ ఆడో, మగో- ఇక్కడ పరీక్ష చేసి చెప్పబడును'' అన్న బోర్డును గోడమీంచి తీసేస్తుంటే సరళ 'హమ్మయ్య' అనుకుంది.

చిలకమ్మ 'అయ్యో' అనుకుంది. ఆస్పత్రిలోని వాళ్ళు చెబుతుంటే ఎస్.డి.టెస్టుల గురించి వింది. ''ఇలాంటి టెస్టులు మా రోజుల్లో ఉంటే నా ఆడపిల్లలకీ గతి పట్టేది కాదు కదా'' అనుకుంది. ఇప్పుడా బోర్డు తీసేస్తుంటే ఆమెకు బాధనిపించింది.

చలపతి కొడుక్కి గుండె పెరగడంతో ఆపరేషన్ చెయ్యాలన్నాడు రమేష్.

"మందులకు తగ్గదా బాబూ?" అని అడిగాడు చలపతి, 'ఆపరేషన్' అనగానే భయపడిపోతూ.

"ఆపరేషన్ తప్పదు, చేయకపోతే ప్రాణానికే ముప్పు రావచ్చు" అన్నాడు రమేష్.

మరుసటి రోజున చలపతి కొడుకును ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్ళారు. గుండె ఆపరేషన్ అంటే చాలా కష్టమైన ఆపరేషన్ అని పక్కగదిలోని ఆసామీ అనడంతో చలపతి బెంబేలెత్తిపోయాడు. జ్ఞప్తికొచ్చిన దేవుళ్ళందరికీ దణ్ణాలు పెట్టాడు. మొక్కులు మొక్కుకున్నాడు.

చిలకమ్మ కన్నీళ్ళు ఆపుకుంటోంది. సాధ్యం కావడంలేదు. కొంత సేపటికి చిలకమ్మకు దుఃఖం ఆగలేదు. పెనుతుఫానులాగా వచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తోంది.

తెరలు తెరలుగా వస్తున్న వెక్కిళ్ళ శబ్దం విని, సరళ కన్సల్టింగ్ రూమ్ నుంచి గబగబా నడిచి- "ఏమ్మా, ఎందుకలా ఏడుస్తావ్?" నీ కొడుక్కేం ఫర్వాలేదు. ధైర్యంగా ఉండు" అని చిలకమ్మ భుజం తట్టి తన రూమ్‌కెళ్ళిపోయింది.

సరళ ఓదార్పుతో చిలకమ్మ దుఃఖం మరింత ఎక్కువైపోయింది.

"డాక్టరమ్మ చెప్పారుగా! ఏడవకమ్మా. డాక్టరు బాబు ఇలాంటి ఆపరేషన్లు ఎన్నో చేశారు. భయం లేదు" అని పక్క గదులనుంచి వచ్చిన ఆడాళ్ళు ఊరడించబోయారు.

చిలకమ్మ దుఃఖం ఆగలేదు. మరింత పెరిగిపోయింది. పెనుగాలిలోని ఎండుటాకులా వణికిపోతోంది.

తన దుఃఖానికి కారణం వారనుకున్నది కాదనీ, ఆపరేషన్ ఫెయిలయితే... తమకో అయిదెకరాలుంచుకున్నా, మిగతా పదిహేను ఎకరాలూ- మూడేసి ఎకరాల చొప్పున అయిదుగురు కూతుళ్ళకూ ఇస్తే- ఒక్కడు పోయినా అయిదుగురు సుఖపడతారు కదా అన్న ఆలోచన వచ్చినందుకేననీ ఆ కన్నతల్లి ఎవరికి మాత్రం ఎలా చెప్పుకోగలదు?

*(ఆంధ్రప్రభ వారపత్రిక, 10-6-1987)*